సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 1 । అక్టోబర్ । 2025

I



టమాట కిలో రూ.17

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి. మార్కెట్‌కు 218 టన్నుల చీనీకాయలు వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
33.9°/ 20.7°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

2 నుంచి ప్రత్యేక రైళ్లు

- షోలాపూర్–ధర్మవరం, బీదర్–బెంగళూరు మార్గంలో..



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. షోలాపూర్–ధర్మవరం, బీదర్–బెంగళూరు మార్గంలో రైళ్లు నడుస్తాయన్నారు. అక్టోబర్ 2 గురువారం రాత్రి 11.20 గంటలకు షోలాపూర్ జంక్షన్‌లో రైలు బయలుదేరి ధర్మవరం జంక్షన్‌కు శనివారం తెల్లవారుజామున 3.30 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి ధర్మవరం జంక్షన్ నుంచి (01438) అక్టోబర్ 4 శనివారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 10.30 గంటలకు షోలాపూర్‌కు చేరుకుంటుందన్నారు. బీదర్, వికారాబాద్, యాదగిరి, కృష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, ములకలచెరువు, కదిరి రైల్వే స్టేషన్ల మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుందన్నారు.

బీదర్–బెంగళూరు మధ్య..

బీదర్–బెంగళూరు మధ్య అక్టోబర్ 4,5 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుస్తాయన్నారు. బీదర్ జంక్షన్ (07063)లో అక్టోబర్ 4 శనివారం మధ్యాహ్నం 2.40 గంటలకు రైలు బయలుదేరి మరుసటి రోజు ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు రైలు బెంగుళూరు చేరుతుందన్నారు. తిరిగి అక్కడి నుంచి అక్టోబర్ 5 ఆదివారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బీదర్ చేరుకుంటుందన్నారు. హమ్నాబాద్, కమలాపూర్, కలబురిగి, షాహబాద్, వాడీ, యాదగిరి, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, యలహంక స్టేషన్ల మీదుగా రైలు నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ధర్మవరం వరకు ‘సూపర్ ఫాస్ట్’ పొడిగింపు

సత్యసాయి జయంత్యుత్సవాల నేపథ్యంలో రైల్వే శాఖ నిర్ణయం

కదిరి: గుంటూరు – తిరుపతి మధ్య నడుస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు (17261)ని ధర్మవరం వరకూ పొడిగించారు. భగవాన్ శ్రీ సత్యసాయి జయంతి (నవంబర్ 23)ని పురస్కరించుకొని రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1 నుండి నవంబర్ 30 వరకు అంటే రెండు నెలల పాటు ఈ రైలు ధర్మవరం వరకు నడుపుతారు. ఆ తర్వాత ఎప్పటి లాగానే తిరుపతి వరకూ వచ్చి ఆగిపోతుంది. రోజూ సాయంత్రం 4.30 గంటలకు ఈ రైలు గుంటూరులో బయలుదేరుతుంది. నరసరావుపేట, వినుకొండ, గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లి, కోవెలకుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, యర్రగుంట్ల, కమలాపురం, రాజంపేట మీదుగా తెల్లవారుజామున 3.55 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. అక్కడి నుండి 4.05 గంటలకు బయలుదేరి పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లి రోడ్, మొలకలచెరువు, కదిరి మీదుగా ఉదయం 9 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. ధర్మవరంలో మధ్యాహ్నం 1.20కి బయలుదేరి తిరుగు ప్రయాణంలో సాయంత్రం 7.15కు తిరుపతి చేరుకుంటుంది. 10 నిమిషాల తర్వాత తిరిగి బయలుదేరి మరుసటి దినం ఉదయం 7.20 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. ఈ రెండు నెలల పాటు రోజూ ఒక రైలు (17261) గుంటూరులో సాయంత్రం 4.30కు బయలుదేరితే, ఇంకో రైలు (17262) ధర్మవరంలో మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరేలా రైల్వేశాఖ అధికారులు నిర్ణయించారు.

ఆగని మట్టిదందా

- రాత్రిపూట తరలింపు



రాత్రిపూట అక్రమంగా మట్టిని తరలిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: అక్రమార్కులు మట్టి దందాను ఆపడం లేదు. అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. వీలైనంత మేర మట్టి తవ్వి.. సొమ్ము చేసుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. పగలైతే అధికారులు అడ్డుకుంటారని భావిస్తున్న అక్రమార్కులు రాత్రిపూట మట్టి తరలించేస్తున్నారు. యర్రదొడ్డి గ్రామంలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్‌కు అక్రమంగా మట్టి తోలుతున్నారు. రాత్రిపూట టిప్పర్లు రాకపోకలు, హిటాచీ యంత్రాల శబ్దాలతో ఇబ్బందికరంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. మట్టి మాఫియాను కట్టడి చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా.. మొన్ననే మట్టి తరలింపు ఆపేయాలని హెచ్చరించామన్నారు. అయినా తోలుతున్నారన్నారు.. వీఆర్వోను పంపించి చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పొరేట్ల కోసమే ప్రైవేటీకరణ

- మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానం దుర్మార్గం
- ప్రభుత్వమే నిర్మాణాలు పూర్తి చేసి.. ప్రారంభించాలి
- పెనుకొండలో కాలేజీ పూర్తయ్యుంటే ఎంతో ఊరట కలిగేది
- నిరసన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు

చిలమత్తూరు: పేదలకు వైద్య విద్య, ప్రజలకు మెరుగైన వైద్యం దూరం చేస్తూ కార్పొరేట్లకు మేలు చేకూర్చడం కోసమే ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలోకి తీసుకొచ్చారని వక్తలు ధ్వజమెత్తారు. పెనుకొండలో మెడికల్ కాలేజీ పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చి ఉంటే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉండేదన్నారు. ప్రభుత్వ నూతన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలోకి తీసుకురావడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో మంగళవారం చేపట్టిన ఆందోళన విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కూటమి ప్రభుత్వ తీరును నిరసించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కాలేజీలు పూర్తి చేసి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు అందుబాటులోకి తేవాలని ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలు వైద్య విద్యనభ్యసించేందుకు.. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించారన్నారు. నిర్మాణాలకు శ్రీకారం చుట్టి ఐదు కళాశాలలను పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారన్నారు. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉంటే.. పూర్తి చేసి ఎంబీబీఎస్ చదువుకునే అవకాశం, అత్యాధునిక వైద్య సేవలు కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం తద్విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. పేదలు ఏమైపోతే ఏమి.. కార్పొరేట్లకు లాభాలు చేకూరిస్తే చాలన్నట్టుగా మెడికల్ కాలేజీల నిర్మాణ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకోవడం సరికాదన్నారు.

పేదలపై కక్ష ఎందుకు?

పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుడితే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదలపై కక్ష కట్టిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.నరసింహమూర్తి ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలను పీపీపీ విధానంలోకి తేవడం పేదలను వైద్య విద్య, మెరుగైన వైద్య సేవలకు దూరం చేయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోకపోతే అన్ని వర్గాలనూ కలుపుకొని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

కాలేజీల నిర్మాణం ప్రభుత్వమే చేపట్టాలి

నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం భారమవుతుందని, అందుకే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానం తీసుకొస్తున్నామని చంద్రబాబు ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి అన్నారు. ప్రతి జిల్లాకూ మెడికల్ కాలేజీ – సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలిస్తే.. చంద్రబాబు వాటిని ప్రైవేట్‌పరం చేయడానికి కంకణం కట్టుకున్నారని ధ్వజమెత్తారు. పెనుకొండలో మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణం రెండంతస్తులు పూర్తయిందని.. తదుపరి పనులు పూర్తి చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడం దుర్మార్గమన్నారు. కాలేజీ అందుబాటులోకి వచ్చి ఉంటే ఎంతోమంది పేదలు స్థానికంగా వైద్య విద్యనభ్యసించే అవకాశం ఉండేదన్నారు. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవవసరం లేకపోయేదన్నారు. పేదల ‘డాక్టర్’ కలను ఛిద్రం చేయడం సరికాదన్నారు.

పేదలు జీవించాలా.. వద్దా..?

పీపీపీ విధానంతో మొదలైన ప్రక్రియ చివరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు దారి తీస్తుందని, దీన్ని ఎంతమాత్రమూ ఒప్పుకునేది లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ హిందూపురం నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యమోహన్ అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కాలేజీల నిర్మాణాలు పూర్తి చేసి.. నిర్వహణ జరగాలని తాము ఆందోళన కొనసాగిస్తామన్నారు. బెదిరించినా, కేసులు పెట్టినా వెనకడుగు వేసేది లేదన్నారు. అన్ని రంగాలూ ప్రైవేటీకరణ చేసుకుంటూ పోతే.. ప్రజలు రాష్ట్రంలో జీవించాలా వద్దా.. అని నిలదీశారు. వైద్య రంగంలో రాణించాలన్న దళితుల ఆశలపై నీళ్లు చల్లొద్దన్నారు. హిందూపురానికి చెందిన నరసింహమూర్తి మాట్లాడుతూ స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లడం కూటమి సర్కారుకు తగదన్నారు. ఇప్పటికైనా పీపీపీ విధానానికి స్వస్తి పలికి.. నిర్మాణ పనులను ప్రభుత్వమే పూర్తి చేసి మెడికల్ కాలేజీలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యమోహన్, మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఫారూఖ్, నాయకులు మలుగూరు శివన్న, నరసింహమూర్తి, శ్రీరాములు, అంబేడ్కర్ నవీన్, నరసింహులు, అయూబ్ బేగ్, శంకర, చందు, రవి, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యను దూరం చేయొద్దు

దళిత, బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వ వైద్యం– విద్యను దూరం చేసేందుకు చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మండిపడ్డారు. పీపీపీ విధానంలోకి తీసుకొస్తే పేదలు ఉచితంగా చదువుకోవడానికి అవకాశాలు పూర్తిగా తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాస్థాయిలో అధునాతన వైద్య సేవలు ఉచితంగా పొందే అవకాశం కూడా లేకుండా చేయడం తగదన్నారు. సీఎం చంద్రబాబు తన అనుయాయులకు లబ్ధి చేకూర్చేందుకు మెడికల్ కాలేజీల నిర్మాణాల ప్రక్రియను పీపీపీ విధానంలోకి తెచ్చారని విమర్శించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గొర్రె పిల్లలను మింగిన కొండచిలువ



రెండు గొర్రె పిల్లలను చంపిన కొండ చిలువ

పుట్టపర్తి అర్బన్: మందలో ఉన్న రెండు చిన్న గొర్రె పిల్లలను కొండ చిలువ మింగింది. ఈ ఘటన పుట్టపర్తి మండలం పైపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం రాత్రి పొద్దుపోయాక సమీపంలోని కొండ నుంచి వచ్చిన భారీ కొండ చిలువ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి విజయ్ మందలోకి చొరబడింది. ఒక పిల్లను మింగేసింది. రెండవ పిల్లను నోట కరుచుకోవడంతో అరుపులు వినిపించాయి. వెంటనే అప్రమత్తమైన విజయ్ తోటి కాపరుల సహకారంతో రెండవ పిల్లను కొండ చిలువ నోటి నుంచి లాగేశారు. అప్పటికే అది మృతి చెందింది. కొండచిలువ ఎటూ వెళ్లలేక మందలోనే ఉండడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు పుట్టపర్తికి చెందిన కరుణ సొసైటీ సిబ్బందికి తెలపడంతో వారు వచ్చి కొండ చిలువను చాకచక్యంగా పట్టుకుని బుక్కపట్నం సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలోకి వదిలేశారు.

వైద్యాధికారులు వెంటనే విధుల్లో చేరాలి

- కలెక్టర్, డీఎంహెచ్‌ఓల ఆదేశం



ఎనుములపల్లి పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

పుట్టపర్తి అర్బన్: ఓపీ సేవలు బంద్ చేసి సమ్మె బాట పట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యాధికారులు వెంటనే విధుల్లో చేరాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం వేర్వేరుగా ఆదేశాలు జారీ చేశారు. వైద్యాధికారులు సమ్మె బాట పట్టడంతో కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ మంగళవారం సాయంత్రం పుట్టపర్తిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవల్లో ఆటంకం కలగకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రి, అనంతపురం మెడికల్ కళాశాల నుంచి 20 మంది వైద్యులను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించి నట్లు చెప్పారు. ఏపీ సివిల్ సర్వీస్ కండక్ట్ రూల్స్, ఎస్మా చట్టం ప్రకారం ఇలా సమ్మె చేయడం చట్టరీత్యా అనుమతించబడవన్నారు. ఈ మేరకు వైద్యాధికారులకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. వెంటనే ప్రభుత్వ వైద్యాధికారులు విధులకు హాజరు కావాలన్నారు. లేని పక్షంలో సీసీఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రోగులతో మాట్లాడారు.

కదులుతున్న కారుపై మందుబాబు హల్‌చల్



మద్యం మత్తులో కారుపై పడుకున్న యువకుడు

పుట్టపర్తి టౌన్: జిల్లా కేంద్రం పుట్టపర్తి సమీపంలోని ప్రశాంతి గ్రాం వద్ద ఓ యువకుడు పూటుగా మద్యం సేవించి కదులుతున్న కారుపై పడుకుని హల్‌చల్ చేశాడు. కొంత దూరం వెళ్లిన తరువాత కారు ఓ గోడను ఢీ కొట్టింది. కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి గానీ, పైన పడుకున్న మందుబాబుకు గానీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. సోమవారం జరిగిన ఈ ఘటన ఒకరోజు ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటయ్యాయి. ప్రశాంతి నిలయం జోన్‌లోని ప్రశాంతి గ్రాంలోనే వైన్‌షాపు తెరిచారు. ఇక్కడ యువకులు మద్యం తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. సత్యసాయి నడయాడిన పుట్టపర్తి పవిత్రతను దెబ్బతీస్తున్నారు. పైగా జిల్లా పోలీస్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఇలాంటి ఘటనలు జరుగుతుండడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల సమ్మె ఉధృతం

- డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద రిలే దీక్షలు
- పీహెచ్‌సీలకు ఇతర డాక్టర్లను పంపడంపై వైద్యుల ఆగ్రహం



పుట్టపర్తిలో రిలే దీక్షల్లో నినాదాలు చేస్తున్న వైద్యులు

పుట్టపర్తి అర్బన్: స్టెతస్కోప్ పట్టుకుని రోగుల నాడి చూడాల్సిన వైద్యులు ప్లకార్డులు చేతపట్టుకుని రోడ్డెక్కి నినాదాలు చేస్తున్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల సంఘం ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద రిలేదీక్షలు కొనసాగిస్తున్నారు. తొలిరోజు సోమవారం నల్ల రిబ్బన్ ధరించి ఓపీ వైద్య సేవలను బహిష్కరించారు. అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో రెండో రోజు మంగళవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. వైద్య సేవలు స్తంభించడంతో.. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల నుంచి వైద్యులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపి వైద్యసేవలు కొనసాగించేందుకు పురమాయించింది. విషయం తెలుసుకున్న వైద్యులు కోపోద్రిక్తులయ్యారు. జిల్లా వైద్యుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర, జనరల్ సెక్రెటరీ పుష్పలత, ఆర్గనైజింగ్ సెక్రెటరీ దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ స్వరూపారెడ్డి తదితరులు ప్రసంగించారు. జీఓ 99ను తొలగించాలన్నారు. ప్రమోషన్ల కోసం కొంతమంది 20 ఏళ్ల నుండి వేచి ఉన్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న వారికి, సంచార చికిత్సలకు వెళ్లిన వారికి అలవెన్సులు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కమిషనర్ వద్ద జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మెను ఉధృతం చేశామన్నారు. సమ్మెకు మద్దతు తెలిపిన బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శివరామకృష్ణ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఎలాగని ప్రశ్నించారు. వైద్యులు లేకపోతే గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో వైద్యులు అందుబాటులో ఉండటం చాలా అవసరమన్నారు.

హత్య కేసు దారి మళ్లిందా?

- భార్య మాత్రమే నిందితురాలని తేల్చిన పోలీసులు
- కేసు నుంచి పలువురిని తప్పించారని అనుమానాలు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాలాజీనాయక్ తల్లిదండ్రులు (ఫైల్)



ఎస్పీకి ఇచ్చిన అర్జీని చూపుతున్న బాలాజీనాయక్ తల్లిదండ్రులు మంగమ్మ, నారాయణనాయక్

పుట్టపర్తి టౌన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో రెండు వారాల కిందట జరిగిన హత్య కేసు దర్యాప్తుపై విమర్శలు వస్తున్నాయి. భార్యతో కలిసి హత్య చేసిన పలువురిని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారులను ఏమాత్రం విచారణ చేయకుండా, వారి అనుమానాలను పరిగణనలోకి తీసుకోకుండానే.. పలువురికి ప్రమేయం లేదన్నట్టు క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చి వదిలేయడం అనుమానాలకు తావిస్తోంది.

ఆనాడు ఏమైందంటే...

బ్రాహ్మణపల్లి తండాకు చెందిన నారాయణ నాయక్ కుమారుడు బాలాజీ నాయక్ (38)కు జగనన్న కాలనీలో భార్య గాయత్రి, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముండేవాడు. పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత సెప్టెంబర్ 15వ తేదీ రాత్రి భోజనం చేశాక భార్యా పిల్లలతో కలిసి మిద్దెపై నిద్రించాడు. అదేరోజు అర్ధరాత్రి గాయత్రి గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చేసరికి బాలాజీనాయక్ మిద్దెపై నుంచి కిందపడి తలకు తీవ్ర గాయమై పడి ఉన్నాడు. వెంటనే ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలాజీనాయక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సీఐ శివాంజనేయులు మరుసటి రోజు ఉదయం జగనన్న కాలనీకి చేరుకుని పరిశీలించారు. తమ కుమారుడి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ బాలాజీనాయక్ తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు.. భార్య గాయత్రితో పాటు మరో నలుగురిని అనుమానితులుగా అదుపులోకి తీసుకున్నారు. అయితే విచారణ చేపట్టిన పోలీసులు.. బాలాజీనాయక్‌ను చంపింది భార్యేనని తేల్చి.. ఆమెను రిమాండ్‌కు పంపించారు. తర్వాత అదుపులో ఉన్న వారిని విడిచిపెట్టారు.

హత్యకు సహకరించిన వారిపై చర్యలేవీ..?

బాలాజీనాయక్‌ను ఒక్కరే హత్య చేయలేదని, మరి కొంతమంది సహకరించారని తల్లిదండ్రులు మంగమ్మ, నారాయణనాయక్ ఆరోపిస్తున్నారు. కోడలు గాయత్రితో పాటు సమీప బంధువు అంజీనాయక్, మహమ్మద్ అలీతో పాటు బిహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు ఇందులో ప్రమేయం ఉందని అంటున్నారు. తమ కుమారుడి చావుకు కారణమైన వారందరినీ కఠినంగా శిక్షించాలని వారు గత సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. పోలీసులు డబ్బు తీసుకుని మిగిలిన వారిని వదిలేసి.. కోడలిని మాత్రమే జైలుకు పంపించారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. స్పందించిన ఎస్పీ సతీష్‌కుమార్ కేసు విచారణ ఫైలు, సీడీలు మరోసారి పరిశీలించి నివేదిక ఇవ్వాలని పుట్టపర్తి పోలీసులను ఆదేశించారు.

న్యాయం జరిగేనా?

హత్య కేసును పుట్టపర్తి అర్బన్ పోలీసులు, ఇంటెలిజెన్స్ పోలీసులు మరోసారి విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. హతుడి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులతో మరొకసారి మాట్లాడినట్లు సమాచారం, ఎస్పీ ఆదేశాల మేరకు కేసు విచారణ పారదర్శకంగా చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తారా..? లేక నీరుగారుస్తారా.. అన్నది వేచి చూడాలి మరి.

ప్రశాంతి నిలయంలో దుర్గాష్టమి వేడుకలు



సత్యసాయి బంగారు రథానికి ఆయుధపూజ నిర్వహించి లాగుతున్న రత్నాకర్, ట్రస్ట్ సభ్యుడు నాగానంద తదితరులు

ప్రశాంతి నిలయం: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దుర్గాష్టమి వేడుకలు ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి బంగారు రథానికి, బాబా జీవించి ఉన్నపుడు వినియోగించిన వాహనాలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆయుధ పూజ చేశారు. బంగారు రథాన్ని ఆర్.జె.రత్నాకర్ భక్తులు, సత్యసాయి ట్రస్ట్ సిబ్బందితో కలసి లాగారు. ట్రస్ట్ కార్యాలయాల్లోనూ దుర్గాష్టమి సందర్భంగా ఆయుధపూజ నిర్వహించారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ పూర్ణచంద్ర ఆడిటోరియంలో చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం కొనసాగుతోంది. దసరా వేడుకల్లో భాగంగా సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. ప్రముఖ పండితుడు మైలవరపు శ్రీనివాసరావు భక్తులనుద్దేశించి ప్రసంగించారు. దుర్గాదేవి వైభవం, దసరా వేడుకలకు ప్రత్యేకత వివరించారు. సత్యసాయి విశ్వమాతగా భక్తులకు అమ్మ ప్రేమను చూపించారని కొనియాడారు. పిదప సత్యసాయి విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశాంతి విద్వాన్ మహాసభలో ప్రసంగిస్తున్న ప్రముఖ పండితులు మైలవరపు శ్రీనివాసరావు

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

ధర్మవరం రూరల్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం ఆదేశించారు. ధర్మవరం మండలం దర్శనమల పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. రికార్డులు, ల్యాబ్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ‘పచ్చ’ మూక దాడి

– నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన పెద్ద ఫక్కీరప్ప



నందకుమార్

ధర్మవరం రూరల్: మండలంలోని ముచ్చురామి గ్రామంలో టీడీపీ నేతల దౌర్జన్యాలు తారస్థాయికి చేరుకున్నాయి. పొలానికి రస్తా విషయంగా గొడవపడి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... ముచ్చురామి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెద్ద ఫక్కీరప్ప, టీడీపీ నేత క్రిష్టయ్య మధ్య పొలాలకు వెళ్లే రస్తా విషయంగా కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. పలుమార్లు ఇరు వర్గాల మధ్య గొడవలు జరిగాయి. ఇదే విషయంగా మంగళవారం రాత్రి పెద్ద ఫక్కీరప్ప, గంటా నరసింహులు, అతని కుమారుడు నందకుమార్, ప్రణీష్‌కుమార్‌పై టీడీపీ నాయకులు క్రిష్టయ్య, బాలచంద్ర, రవికుమార్, రామాంజి కట్టెలతో దాడికి తెగబడ్డారు. స్థానికులు అడ్డుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ధర్మవరం రూరల్ పోలీసులు తెలిపారు.

జై జవాన్.. జై కిసాన్!

- తాడిపత్రి ఖ్యాతిని ఖండాంతరాలకు చేర్చిన విద్యార్థినులు
- అరుదైన అవకాశాలతో విదేశాల్లో శిక్షణ

తాడిపత్రి టౌన్: అరుదైన అవకాశాలతో తాడిపత్రి ఖ్యాతిని ఇద్దరు విద్యార్థినులు ఖండాంతరాలు దాటించారు. ఓ విద్యార్థిని దక్షిణాఫ్రికాలో పైలెట్ శిక్షణ తీసుకుంటుండగా.. మరో విద్యార్థిని రూ.70 లక్షల ఉపకార వేతనంతో జపాన్ దేశంలో ఉచిత సీటు సాధించి వ్యవసాయంపై పరిశోధనలు చేస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. ఒకరు జై కిసాన్ అంటుండగా.. మరొకరు జై జవాన్ నినాదంతో తమ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారు.

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం..



జపాన్‌లోని హొక్కాయిడో వర్సిటీ అగ్రి ల్యాబ్‌లో పరిశోధనలు నిర్వహిస్తున్న భానురేఖ

తాడిపత్రిలోని అంబాభవానీ వీధిలో నివాసముంటున్న వద్ది మోహన్ కుమార్తె భానురేఖ.. వ్యవసాయంపై మక్కువతో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా చదువులో ప్రతిభ కనబరుస్తూ ఇక్రిశాట్‌లో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌కు అర్హత సాధించింది. అనంతరం ఎమ్మెస్సీ చదివేందుకు జపాన్‌లోని మెక్స్ సంస్థ నిర్వహించిన పోటీ పరీక్షల్లో నెగ్గి ఆ దేశంలోని హొక్కాయిడో యూనివర్సిటీలో రూ.70 లక్షల ఉపకార వేతనంతో ఉచితంగా సీటు దక్కించుకుంది. వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదిగి ఆధునిక వ్యవసాయంపై పరిశోధనలు చేసి, వాటి ఫలాలను రైతులకు చేరువ చేస్తానని భానురేఖ సగర్వంగా అంటున్నారు.

తండ్రి స్ఫూర్తితో...



పైలెట్ శిక్షణకు ఎంపికైనట్లుగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సాయిహరితారెడ్డి

తాడిపత్రిలోని రెడ్డివారిపాలెంలో నివాసముంటున్న మనోహర్‌రెడ్డి భారత సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్ఫూర్తితో భారత సైన్యంలో చేరాలని కుమార్తె సాయిహరితరెడ్డి పరితపిస్తూ వస్తోంది. ఈ క్రమంలో బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వెంటనే ఐసీఐసీఐ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. అయినా రాజీ పడకుండా ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ తొలిసారిగా అమ్మాయిలకు పైలెట్ శిక్షణ కోసం చేపట్టిన ఇంటర్వ్యూలకు హాజరైంది. ఇంటర్వ్యూలో ప్రతిభ చాటి పైలెట్ శిక్షణకు అర్హత సాధించిన సాయిహరిత రెడ్డిని అభినందిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని వ్యోమగామి కల్పనాచావ్లా తల్లి అందజేసింది. ప్రస్తుతం సాయి హరితారెడ్డి దక్షిణాఫ్రికాలో పైలెట్ శిక్షణ తీసుకుంటోంది. తన తండ్రిలా సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలనేదే లక్ష్యమని ఆమె చెబుతున్నారు.

‘స్పీడ్’ పెంచిన ‘తపాలా’

- నేటి నుంచి స్పీడ్ పోస్టులోకి రిజిస్టర్ పోస్టు విలీనం
- తడిసి మోపెడవుతున్న చార్జీలు
- దేశ వ్యాప్తంగా ఏకీకృత టారిఫ్



అనంతపురంలోని తపాలా కార్యాలయం

అనంతపురం సిటీ: రిజిస్టర్ పోస్టును రద్దు చేసి, స్పీడ్ పోస్టులో కలిపేస్తున్నట్లు ప్రకటించిన తపాలా శాఖ.. స్పీడ్ పోస్టు చార్జీలను భారీగా పెంచింది. పెరిగిన కొత్త ధరలు అక్టోబర్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. దీంతో వినియోగదారుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కాకుండా ఉండేందుకు ఈ–కామర్స్ తరహాలో ఓటీపీ ఆధారిత డెలివరీ వంటి సేవలు, దేశ వ్యాప్తంగా ఒకే టారిఫ్, విద్యార్థులకు 10 శాతం రాయితీ అంటూ నమ్మబలికే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది.

నేటి నుంచే స్పీడ్ పోస్టు అమలు

అతి తక్కువ ఖర్చుతో అనువైన తపాలా సేవగా కొనసాగుతూ వచ్చిన రిజిస్టర్ పోస్టును తపాలా శాఖ పూర్తిగా రద్దు చేస్తూ స్పీడ్ పోస్టులోకి విలీనం చేసింది. తపాలా శాఖ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్య తరగతి వర్గాల వారిపై అదనపు భారం పడుతోంది. అంతేకాక పోస్టు డెలివరీ సమయంలో చిరునామాదారు ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ధ్రువీకరణ తరువాతే పోస్టుమాన్ ఆ పోస్టును అందజేస్తారు. ఈ సేవ కోసం నిర్దేశిత టారిఫ్ మీద జీఎస్టీ కాకుండా అదనంగా ఒక్కో ఆర్టికల్‌కు రూ.5 చొప్పున వసూలు చేస్తారు. బల్క్ సేవలు వినియోగించుకునే సంస్థలకు 5 శాతం తగ్గింపు ప్రకటించింది. అయితే తపాలా శాఖ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకే..



కేంద్ర తపాలా శాఖ తీసుకుంటున్న నిర్ణయాలు కార్పొరేట్ కొరియర్ సంస్థలకు మేలు చేకూర్చేలా ఉన్నాయి. దశాబ్దాలుగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్టులోకి విలీనం చేయడం వినియోగదారుల నడ్డి విరిచే నిర్ణయం తీసుకుంది.

– ఇనగలూరు ఇమ్రోజా, నిరుద్యోగి, అనంతపురం

ధరలు పెంచి రాయితీనా?



అందరికీ అనువైన ధరలతో ఉన్న రిజిస్టర్ పోస్టును రద్దు చేసిన స్పీడ్ పోస్టులో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే స్పీడ్ పోస్టు ధరలు విపరీతంగా ఉన్నాయి. పైగా విద్యార్థులకు మాత్రం పది శాతం రాయితీ ఇస్తున్నట్లు గొప్పలకు పోయారు. ధరలు ఇష్టానుసారంగా పెంచి తగ్గిస్తున్నట్లు బుకాయించడం దేనికో?

– బోయ ఎస్.పల్లవి, ఉద్యోగిని, అనంతపురం

సకాలంలో వైద్యం అందక యువకుడి మృతి



తీవ్ర గాయాలతో నవీన్‌కుమార్

తనకల్లు: ప్రమాదంలో గాయపడిన యువకుడిని గోల్డెన్ అవర్‌లోనే ఆస్పత్రికి చేర్చినా.. సకాలంలో వైద్యం అందక మృతి చెందాడు. వివరాలు.. ఎన్పీకుంట మండలం ఎదురుదొన గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ (21) తన భార్య లలితకుమారితో కలసి మంగళవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా పెద్దపాలెం గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తనకల్లు మండలం చీకటిమానిపల్లి సమీపంలో ఉన్న కేకే ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే ఎదురుగా దూసుకొచ్చిన కంటైనర్ ఢీకొంది. నవీనకుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, లలితకుమారి కాలికి బలమైన గాయమైంది. విషయం తెలుసుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్సులో గోల్డెన్ అవర్‌లోనే క్షతగాత్రులను తనకల్లులోని ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. చికిత్స అందేలోపు నవీన్‌కుమార్ మృతి చెందాడు. మెరుగైన వైద్యం కోసం లలితకుమారిని కదిరికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

వైద్యులు అందుబాటులో లేరంటూ ఆందోళన

స్థానిక ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రికి సకాలంలో నవీన్‌కుమార్‌ను చేర్చినా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మృతి చెందాడంటూ కొక్కంటి క్రాస్‌కు చెందిన పలువురు యువకులు ఆస్పత్రి ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆందోళన కారులు మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై ఆస్పత్రికి చేరుకుంటున్న క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందించాల్సిన వైద్యులు పత్తాలేకుండా పోతున్నారని మండిపడ్డారు. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉన్నా... అత్యవసర సమయంలో ఏ ఒక్కరూ అందుబాటులో ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గోపి అక్కడకు చేరుకుని నిరసనకారులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. జీఆర్పీ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు... 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి కొన్ని రోజులుగా సీకే పల్లి మండలం బసంపల్లి గ్రామంలో తిరుగుతూ ఉండే వాడన్నారు. మంగళవారం రాత్రి బసంపల్లి నుంచి కనుముక్కల వైపు వెళ్లే దారిలో పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొంది. ఘటనలో దూరంగా ఎగిరి పడిన వ్యక్తి శరీర అవయవాలు తెగి పడ్డాయి. లోకో పైలెట్ ఇచ్చిన సమాచారంతో జీఆర్పీ కానిస్టేబుల్ ఎర్రిస్వామి బసంపల్లికి చేరుకుని స్థానికుల సాయంతో ఘటనాస్థలాన్ని గుర్తించాడు. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఆర్మీ మద్యాన్ని తరలిస్తూ పట్టుబడిన ఆర్టీసీ డ్రైవర్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు

అనంతపురం: కర్ణాటక నుంచి ఆర్మీ మద్యాన్ని తరలిస్తూ ఎక్సైజ్ అధికారులకు ఓ ఆర్టీసీ డ్రైవర్ పట్టుబడ్డాడు. వివరాలను అనంతపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ మంగళవారం వెల్లడించారు. అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం బెంగళూరు నుంచి వస్తున్న ఆర్టీసీ అనంతపురంలోని ధర్మవరం రోడ్డులో ఉన్న శివకోటి ఆలయం వద్ద ఆపి తనిఖీ చేశారు. సాధారణ ప్రయాణికుడిలా ప్రయాణిస్తున్న శివకోటి ఆలయం వద్ద నివాసముంటున్న ఆర్టీసీ డ్రైవర్ పి.ఓబులనారాయణరెడ్డి వద్ద నుంచి 60 ఆర్మీ ఫుల్ బాటిళ్ల మద్యం పట్టుబడింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అదే బస్సులో ముందు వైపు కూర్చొన్న పాత నిందితులు సాకే పవన్‌కుమార్, వడే శ్రీనివాసులు వెంటనే బస్సు దిగి పారిపోయారు. బెంగళూరులోని ఆర్మీ క్యాంటీన్ నుంచి మద్యం కొనుగోలు చేసి జిల్లాకు అక్రమంగా చేరవేస్తున్నట్లుగా విచారణలో వెలుగు చూసింది. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు జాకీర్ హుస్సేన్, జయ నరసింహ, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగుడుకు డబ్బివ్వలేదని కొడవలితో దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేశన్న

అనంతపురం: మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదంటూ సొంత మేనమామ కొడుకుపైనే కొడవలితో దాడి చేసిన ఘటన అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం గ్రామ సింగిల్ విండో ప్రెసిడెంట్ చాకలి కేశన్న మంగళవారం సాయంత్రం అనంతపురంలోని పాతూరు జంగాలపల్లి మసీదు వద్ద ఉన్న సమయంలో మేనత్త కుమారుడు సుబ్బారావు కలసి మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే రోజూ తాగుడుకు డబ్బు కావాలంటూ దౌర్జన్యం చేయడం సరికాదని కేశన్న సర్దిచెప్పబోతుండగా కొడవలితో దాడికి తెగబడ్డాడు. స్థానికులు కేకలు వేయడంతో సుబ్బారావు అక్కడి నుంచి పారిపోయాడు. క్షతగాత్రుడు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందాడు. బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఇద్దరూ టీడీపీకి చెందిన వారే కావడం, పైగా సమీప బంధువులు కావడంతో దాడిని రాజీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం.

పండగ పూట పస్తులే!

- సమగ్ర శిక్ష ఉద్యోగులపై కనికరం చూపని కూటమి సర్కారు
- రెండు నెలలుగా అందని జీతాలు
- దిక్కులు చూస్తున్న చిరుద్యోగులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ నిర్వాకంతో సమగ్రశిక్ష పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అతి పెద్ద పండుగ చేసుకోలేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 వేలమంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లు, మండల్ లెవెల్ అకౌంటెంట్లు, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్పీలు, ఫిజియోథెరపిస్టులు, సైట్ ఇంజనీర్లు, ఆయాలు, డీపీఓ సిబ్బంది, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులున్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం పేర్లతో వీరంతా తక్కువ వేతనాలతో పని చేస్తున్నారు ప్రతి నెలా జీతం డబ్బులు అందితే గాని కుటుంబ పోషణ జరగదు. అలాంటిది రెండు నెలలుగా జీతాలు లేవు. ఇంటి బాడుగ, పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక కనీసం ఇంటి నిత్యవసరాలు కూడా కొనలేని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో హిందువుల అతిపెద్ద పండుగ కూడా వచ్చింది. పెద్దల సంగతి పక్కన పెట్టి కనీసం పిల్లలకు కొత్త దుస్తులు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. పండుగ ముందు జీతాలు వస్తాయని ఎదురుచూసినా 30వ తేదీతో అది నిరాశగానే మిగిలింది. ఈ నేపథ్యంలో కొందరు వడ్డీకి అప్పులు చేయగా, మరికొందరు ఎంఈఓలు, హెచ్ఎంలు, టీచర్ల వద్ద నగదు బదిలీ తీసుకున్నారు. ఎన్నికల ముందేమో ఉద్యోగులందరికీ 1వ తేదీనే జీతాలు ఇస్తామన్న కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల పట్ల పక్షపాతవైఖరిని అవలంభిస్తుండడం గమనార్హం.

పస్తులు పెడుతున్నారు



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల కోసం రాష్ట్ర ఉన్నతాధికారులు, రాష్ట్ర ఫైనాన్స్ కంట్రోలర్‌ను కలిసి విన్నవించాం. పండుగలోపు రెన్నెళ్ల జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ వేయలేదు. పండుగ పూట ఉద్యోగులను పస్తులు పెడుతున్నారు.

– కె.విజయ్, సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్

అసాంఘికశక్తుల ఆట కట్టించాల్సిందే

- ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్



కదిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ సతీష్‌కుమార్

కదిరి: శాంతిభద్రతలకు విఘాతం కల్గించే అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కదిరి డీఎస్పీ కార్యాలయంతో పాటు రూరల్, పట్టణ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటివారైనా సరే.. ఉపేక్షించవద్దని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలియజేశారు. ఏదైనా అన్యాయం జరిగినప్పుడే బాధితులు పోలీసులను ఆశ్రయిస్తారని, అలాంటి వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని.. ఈ విషయంలో తేడా వస్తే క్షమించేది లేదన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి పోలీస్ అధికారీ పల్లె నిద్ర చేసినప్పుడే ప్రజలకు పోలీసుల పట్ల మరింత గౌరవం పెరుగుతుందని, అప్పుడే ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా పోలీసుల దృష్టికి తీసుకొస్తారని తెలియజేశారు. బాల్య వివాహాలు, సైబర్ మోసాలపై ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు.

సీసీ కెమెరాలుండేలా చూడండి

పట్టణాల్లోని అపార్ట్‌మెంట్లు, దుకాణాలు, ప్రార్థనామందిరాల వద్ద కచ్చితంగా సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలపై కూడా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. దొంగతనాలు జరగక్కుండా రాత్రి సమయాల్లో గస్తీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యత నివ్వాలని దిశానిర్దేశం చేశారు. అంతకుముునుపు కదిరి సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల సమస్యలపై డీఎస్పీ శివనారాయణస్వామిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పట్టణ పోలీస్ స్టేషన్‌లోని లాకప్ గదులు, మహిళా హెల్ప్‌డెస్క్, పట్టుబడిన ద్విచక్ర వాహనాలతో పాటు స్టేషన్ ప్రాంగణం మొత్తం కలియదిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో సీఐలు నారాయణరెడ్డి, నాగేంద్ర, నిరంజన్‌రెడ్డి, పలువురు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

10న మెగా జాబ్ మేళా

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీన హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 15 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ/ ఎం.ఫార్మసీ, నర్సింగ్ / ఎనీ డిగ్రీ, ఎనీ బి.టెక్, పీజీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.35 వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు. అభ్యర్థులు కచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో రావాలని, మరిన్ని వివరాలకు 96767 06976 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణశాఖ, విశాఖ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు ఈ నెల 1న 0.4 మి.మీ, 2న 0.2 మి.మీ, 3న 2.4 మి.మీ, 4న 5.5 మి.మీ, 5న 6.2 మి.మీ సగటు వర్షపాతం నమోదు కావొచ్చన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 32.2 డిగ్రీల నుంచి 32.7 డిగ్రీలు, రాత్రిళ్లు 22.8 డిగ్రీల నుంచి 23.2 డిగ్రీల మధ్య ఉండొచ్చన్నారు. గాలిలో తేమశాతం ఉదయం 79 నుంచి 82, మధ్యాహ్నం 43 నుంచి 60 శాతం మధ్య రికార్డు కావొచ్చన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 10 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపారు.

అరటి చెట్టుకు రెండు గెలలు



పుట్లూరు: సాధారణంగా అరటి చెట్టుకు ఒక గెల మాత్రమే వస్తుంది. అయితే ఇందుకు భిన్నంగా పుట్లూరు మండలం రంగరాజుకుంట గ్రామానికి చెందిన రైతు పొన్నపాటి హనుమంతురెడ్డి తోటలో ఒక చెట్టుకు రెండు గెలలు వచ్చాయి. నాలుగు ఎకరాల్లో అరటి పంటను సాగు చేయగా రెండవ పంటలో ఇలా ఒక చెట్టుకు మాత్రమే రెండు గెలలు వచ్చిన విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇలా రెండు గెలలు రావడం ఎన్నడూ చూడలేదని స్థానిక రైతులు చెబుతున్నారు. కాగా, అరటి మొక్క కాండంలో రెండవ శిరోజం ఏర్పడినప్పుడు ఇలా రెండు గెలలు వస్తాయని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పర్యాటకులపై తేనెటీగల దాడి

తాడిపత్రి టౌన్: నియోజకవర్గంలోని యాడికి మండలం కోనుప్పలపాడు సమీపంలో ఉన్న వాటర్ పాల్స్ వద్ద పర్యాటకులపై మంగళవారం తేనెటీగలు దాడి చేసాయి. తాడిపత్రి పట్టణానికి చెందిన ఉదయ్ కిరణ్, పృథ్వీరాజ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. దసరా పండుగకు తాడిపత్రికి వచ్చి కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం కోన వాటర్ పాల్స్ చూసేందుకు వెళ్లారు. అక్కడ సరదాగా గడుపుతున్న సమయంలో తేనెటీగలు దాడి చేసాయి. హుటాహుటిన పిల్లలను వాహనంలో ఎక్కించుకుని దూరంగా రావడంతో పెనుప్రమాదం తప్పింది. ఉదయ్‌కుమార్, పృథ్వీరాజ్ తీవ్ర అస్వస్థతకు గురై తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

యువకుడి దుర్మరణం

- ఫిబ్రవరిలో పెళ్లి నిశ్చయం
- ఇంతలో దుర్ఘటన



రంగనాథ్ (ఫైల్)

అగళి: బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం రంగసపల్లి గ్రామానికి చెందిన మేలగిరియప్ప కుమారుడు రంగనాథ్ (26) మంగళవారం అగళి మండలం హెచ్‌డీ హళ్లి గ్రామంలోని తన అక్క ఇంటికి వచ్చాడు. భోజనం ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. జంగమరపల్లి చెక్‌పోస్ట్ వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఎగిరి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు అక్కడకు చేరుకుని ఒక్కగానొక్క కుమారుడు మృతితో బోరున విలపించారు. ఫిబ్రవరిలో రంగనాథ్‌కుర వివాహం నిశ్చయమైందని, ఇంతలోనే ఇంతటి ఘోరం జరిగిందంటూ రోదించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు.

బొలెరో ఢీకొని....

తనకల్లు: మండలంలోని చీకటిమానిపల్లి సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తనకల్లు మండలం సింగిరివాండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు (31) వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనిపై మంగళవారం అన్నమయ్య జిల్లా పాతకోటకు వెళ్లిన శ్రీనివాసులు అక్కడ పనిముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. చీకటిమానిపల్లి సమీపంలో 42వ జాతీయ రహదారిపై ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన శ్రీనివాసులు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.